


మన భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం
గురువారం 17 సెప్టెంబర్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3




# సమాజ సేవలో వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ ముందుండాలి









భానుపురి/సూర్యాపేట టౌన్

సమాజ సేవలో వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ ముందుండాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు మొరిశెట్టి లక్షాధి, డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో బుధవారం వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కార్యాలయమును వారు ప్రారంభించి మాట్లాడారు. ఎంతోమంది పేద విద్యార్థులు విద్యా, వైద్యం, అగ్రికల్చర్ వంటి ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇబ్బందులు పడుతుంటారని అలాంటి పేదవారికి అండగా ఉండడానికి వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా సేవా కార్యక్రమాలను అలవర్చు కోవాలని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం కూడా చేయని పనులు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్నాయని కొనియా డారు. వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మహంకాళి రవీందర్ రావు మాట్లాడుతూ ప్రప్రథమంగా పేద ప్రజలకు సేవలు అందించుటకు సూర్యాపేటలో ఏర్పాటు చేశామని రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా వారాహి హెల్పింగ్ హాండ్స్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తరిస్తా మని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల చంద్రశేఖర్ , వారాహి గౌరవ సలహాదారులు రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చల్లా సత్యనారాయణ, కార్యదర్శి ఖమ్మంపాటి రేణు బాబు, కోశాధికారి బచ్చు పురుషోత్తం జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్, ఈసీ సభ్యులు మొలుగూరి శోభారాణి, పల్లెల ప్రసాద్ రావు, సుంకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుధారాణి, అమరేందర్ రెడ్డి, బొడ్డుపల్లి సతీష్, గజ్జి నవీన్,ఉయ్యాల నర్సయ్య, మామిడి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## పేద ఆర్యవైశ్య కుటుంబానికి చేయూత



భానుపురి/సూర్యాపేట టౌన్

పేదవారికి సహాయం చేయడంలో ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని సూర్యాపేట ఆర్యవైశ్య మిత్రులు తెలిపారు. బుధవారం శ్రీ వాసవి సేవాసమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం కోరిక మేరకు హైదరాబాద్ కు చెందిన మాటలు రాని దివ్యాంగ కుటుంబము చల్లా పాండరయ్య, ఆయన కుమార్తె శిరీష కు దాతలు యామా ప్రభాకర్, పోతుగంటి వెంకటేశ్వర్లు, తప్సీ గాంధీ, కలకోట లక్ష్మయ్య, చల్లా సత్యనారాయణ (కిరాణం) ,నీలా శ్రీనివాస్ బెలిదె వెంకన్న,వనమా నరసింహరావు,తల్లాడ శ్రీనివాస్ ,బిక్కుమల్ల సంతోష్ బ్రహ్మాండపల్లి సంతోష్ బూర్లె నవీన్ ,శిల్ప(హైదరాబాదు)బ్రహ్మదేవర సోమయ్య, వుప్పల శ్రవణ్, చల్లా లక్ష్మి ప్రసాద్, చక్క లక్ష్మయ్య, చల్లా పాండయ్య ,వాసా రాజశేఖర్ ల సహకారంతో రూ. 12,500 అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మిత్రులు పలువురు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదవారికి నిరంతరం మా వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్రులు పోతుగంటి వెంకటేశ్వర్లు, తప్సీ గాంధీ, కలకోట లక్ష్మయ్య, చల్లా సత్యనారాయణ, చల్లా పాండయ్య, ఉప్పలంచు కృష్ణ, కలకోట నరసయ్య,కొండ శ్రీనివాసరావు, నవిలిపురి నరేందర్, చిత్తలూరి శ్రీధర్ , చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల రైలు కోసం సామాజిక నేతల మద్దతు





భానుపురి/హైదరాబాద్

సూర్యాపేటకు సామాన్యుల రైలు సాధించేందుకు కొనసాగుతున్న ప్రజా ఉద్యమానికి సామాజిక ఉద్యమ నేతల మద్దతు లభించింది. సూర్యాపేట రైల్వే సాధన సమితి ప్రతినిధులు బుధవారం మాదిగ దండోరా వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్. కృష్ణయ్యలను వేర్వేరుగా కలిసి రైల్వే సాధన ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలని కోరారు. సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించాల్సిన అవసరాన్ని వివరిస్తూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు సానుకూలంగా స్పందిస్తూ, సూర్యాపేట రైల్వే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సంబంధిత కేంద్ర మంత్రితో మాట్లాడతామని హామీ ఇచ్చినట్లు సమితి ప్రతినిధులు తెలిపారు.ప్రధానమంత్రి దృష్టికి సూర్యాపేట రైల్వే సమస్యను తీసుకెళ్లేందుకు లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమాన్ని చేపట్టామని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉత్తరాలు రాస్తు న్నారని తెలిపారు. విద్యా ర్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, వ్యాపారులు, ఉద్యో గులు, పెన్షనర్లు, దివ్యాంగులు సహా అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా విజయవాడ వరకు జాతీయ రహదారి 65 వెంట సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని సమితి ప్రతినిధులు కోరారు. ఇప్పటికే ప్రతిపాదనల్లో ఉన్న రైల్వే మార్గాల సాధ్యాసాధ్యాలను పరిశీలించి సూర్యాపేటకు రైలు అందించే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**-కేంద్ర మంత్రితో మాట్లాడతామని హామీ**

సమితి ప్రతినిధులు వివరించిన అంశాలను మందకృష్ణ మాదిగ, ఆర్.కృష్ణయ్య ఆసక్తిగా విన్నట్లు నాయకులు తెలిపారు. సూర్యాపేటకు సామాన్యుల రైలు సాధించాలనే డిమాండ్‌కు తమ మద్దతు ఉంటుందని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఇరువురు నేతలు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.సంబంధిత కేంద్ర మంత్రితో మాట్లాడి సూర్యాపేట ప్రజల ఆకాంక్షను తెలియజేస్తామని సానుకూలంగా స్పందించినట్లు సమితి ప్రతినిధులు వెల్లడించారు.సామాజిక ఉద్యమాల్లో విశేష అనుభవం ఉన్న నేతల మద్దతు లభించడం పట్ల సమితి ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. సూర్యాపేట రైల్వే సాధన ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసేందుకు వివిధ సామాజిక సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులను కలిసి మద్దతు కూడగడతామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించే వరకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, కో కన్వీనర్ రాచూరి ప్రతాప్, గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య, జేఏసీ కో కన్వీనర్ నల్లపాటి అప్పారావు, చింతలపాటి చిన్న శ్రీరాములు, యా తాకుల రాజన్న, మామిడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ దీక్షలో కూర్చున్న రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్యవైశ్య మిత్రుల సంఘీభావం

భానుపురి /సూర్యాపేట టౌన్




గత 33 రోజులుగా సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ నడపాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా బుధవారం ఈ రిలే నిరాహార దీక్షలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొనగా సూర్యాపేటకు చెందిన ఆర్యవైశ్య మిత్రులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మిత్రులు తప్సీ గాంధీ,కలకోట లక్ష్మయ్య, చల్లా సత్యనారాయణ, శ్రీ వాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా, చిరకాల కోరికగా సూర్యాపేటకు రైలు మార్గం పునరుద్దించాలనీ కోరుతూ ఆర్యవైశ్య ప్రముఖులు మంచాల రంగయ్య నేతృత్వంలో ఎంతోమంది నాయకులకు విన్నవించుకున్న కొందరి స్వార్ధపూరిత ప్రయోజనాలతో రైలు మార్గం సూర్యాపేట మీదుగా పునర్ధించకుండా ఇతర మార్గాల ద్వారా దారి మళ్లించి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట నుండి రైలు మార్గం పునరుద్దించే వరకు ఈ రిలే నిరాహార దీక్షలకు ఆర్యవైశ్యుల మద్దతు ఉంటుందని తెలిపారు. ఈనెల 18 శుక్రవారం సూర్యాపేట బందులో భాగంగా పూర్తి మద్దతు ప్రకటించారు. 70 ఏళ్ల వయసు లోనూ ప్రజల అవసరాల కొరకు దీక్షలో కూర్చున్న సీనియర్ సిటిజన్స్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్రులు ఉప్పలంచు కృష్ణ, నరేందర్, కొండ శ్రీనివాస్, నూనె సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# మద్యం తాగి ప్రజలకు ఇబ్బందులు




భానుపురి/సూర్యాపేట టౌన్

చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధిలోని దూరాజ్‌పల్లి వద్ద మద్యం మత్తులో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ ఉన్న వ్యక్తి గురించి డయల్ 112కు సమాచారం అందింది. సమాచారం మేరకు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా, దూరాజ్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ మునీర్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో చివ్వెంల ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి, నిందితుడిని ఈరోజు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వి. మహేశ్వర్ మాట్లాడుతూ.. మద్యం మత్తులో బహిరంగ ప్రదేశాల్లో హంగామా సృష్టించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చర్యలకు పాల్పడకుండా, పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి






భానుపురి /సూర్యాపేట టౌన్

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి, శాంతియుతంగా బాధ్యతాయుతంగా నిర్వహించుకోవాలని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సూర్యాపేట డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రవి మహాల్ ఫంక్షన్ హాల్‌లో ఉత్సవ కమిటీలతో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎస్పీ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు శాంతి సంఘం సమావేశాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఉత్సవ కమిటీలతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఉత్సవ కమిటీ సభ్యుడు బాధ్యతగా వ్యవహరిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గణేష్ మండపాన్ని పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని, మండపాల వద్ద పోలీసుల పెట్రోలింగ్, గస్తీ కొనసాగుతుందని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిస్తూ భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనం చేసే ప్రదేశాలను ముందుగానే గుర్తించుకోవడంతో పాటు, నిమజ్జనానికి వెళ్లే మార్గాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పరస్పరం సహకరించుకుంటూ కుల,మత భేదాలకు అతీతంగా కలిసిమెలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఆనందంగా, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ ప్రశాంత్ కుమార్ కోరారు. ఉత్సవాల సమయంలో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి డయల్ 112 కు సమాచారం సూచించారు. ఈ సమావేశంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిఐ లు రాజ శేఖర్, ఉపేందర్ రావు, సూర్యాపేట మున్సిపల్ చైర్మన్, కమిషనర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, వివిధ గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు రజితోత్సవ సభ - పోస్టర్ ఆవిష్కరణ"

భానుపురి /సూర్యాపేట టౌన్



దాదాపు 25 సంవత్సరాల క్రితం తెలుగు అకాడమీ మాజీ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్ సంపాదకత్వంలో "వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు" అనే బిసి వాద కవిత్వ సంకలన పుస్తకం వెలువడింది. ఈ పుస్తకం వెలువడి నేటికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పుస్తకానికి ఈనెల 20వ తేదీన హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోరజతోత్సవ సభ ఏర్పాటు చేస్తున్నట్లు మనం వికాస వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా రజితోత్సవ సభ పోస్టర్ ను ఆవిష్కరిస్తూ మాట్లాడారు. 23 మంది బీసీ కవులు తెలంగాణలో తమ ఆత్మ కథనాత్మకమైన అస్తిత్వ కవిత్వాన్ని వెలువరించి తెలుగు సాహిత్యంలో విశిష్టతను చాటుకున్నట్లు తెలియజేశారు. ఈ రజితోత్సవము సందర్భంగా బీసీ కవులందరిచేత బీసీ కులాల అలాయి బలాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ కులాల కవులు రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పిల్లలమర్రి పిన వీరభద్రం కళాపీఠం వ్యవస్థాపకులు శీలా అవిలేను, కవి రచయితలు గొడితాల వెంకటేశ్వర్లు, ఏబెల్ శశి, పబ్బతి వెంకటేశ్వర్లు, డాక్టర్ మెంతబోయిన సైదులు, పోతుగంటి వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ నిషేధిత జాబితా నుంచి పేదల భూములు, ఇళ్లను తొలగించాలి

-టిడిపి నాయకులు పోగుల సైదులు గౌడ్.

భానుపురి/మిర్యాలగూడ



తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకున్న 22ఏ నిషేధిత జాబితా నుంచి పేద బడుగు బలహీన వర్గాల ప్రజల భూములు ఇళ్లకు మినహాయింపు కలిగించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పోగులు సైదులు డిమాండ్ చేశారు. పట్టా భూములు, గతంలో సేల్ డీడ్ అయిన ప్లాట్లు, ఇళ్లను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ ప్రజల తరఫున నిలబడి ప్రభుత్వం, స్థానిక సంస్థలు రోడ్లు, విద్యుత్, నీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించిన ప్రాంతాల్లో 20ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదల ఆస్తులను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా భూమి అనుభవిస్తూ పట్టాదారు భూహక్కుపత్రాలు కలిగివుండి భూములను కూడా 22ఏ చేర్చడం వల్ల పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి వెంటనే వాటిని తొలగించే రిజిస్ట్రేషన్ కి అవకాశం కల్పించాలని కోరారు. గతంలో రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22లో నిషేధిత ఆస్తుల జాబితాలో ప్రైవేట్ ఆస్తులను తప్పుగా పరిమితికి మించి చేయాలని మరియు మొత్తం గా చేర్చడం వల్ల ప్రజలకు ఎదురవుతున్న తీవ్ర అసౌకర్యం మరియు ఇబ్బందులు సెక్షన్ 22ఏ యొక్క పరిధి మరియు శాసన ఉద్దేశం రికార్డుల సమగ్ర సమీక్ష సవరణ మరియు సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కారం చేసి పేద మధ్యతరగతి కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి



భానుపురి/ సూర్యాపేట టౌన్

ఈ నెల 19వ తేదీన కోదాడ పట్టణంలోని సిసి రెడ్డి కాన్వెంట్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో, గౌరవ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని, అవకాశాలను విజయాలుగా మార్చుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సూచించారు. ఈ సందర్భంగా బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మెగా ఉద్యోగ మేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ మేళాకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఎస్పీ నరసింహ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. మెగా ఉద్యోగ మేళాలో వివిధ రంగాలకు చెందిన 300 వరకు ప్రముఖ సంస్థలు పాల్గొని ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నందున, విద్యార్థులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ముందు గానే స్కానర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా అందు బాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను పరిశీలించి, తగిన ఉద్యోగాన్ని సాధించేందుకు ఈ మెగా ఉద్యోగ మేళాను ఒక మంచి అవకాశంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, కళాశాల ప్రినిస్పాల్ ముత్యాలరాజు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# టెక్నాలజీని జ్ఞానానికి, లక్ష్య సాధనకు ఉపయోగించాలి

భానుపురి/ సూర్యాపేట టౌన్





విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేస్తూ, తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, మేధస్సును, తెలివితేటలను సరైన మార్గంలో ఉపయోగించుకొని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ సూచించారు. సూర్యాపేటలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన "ఎక్స్‌పర్ట్ టాక్" కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే జీవితానికి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, ఆ లక్ష్య సాధన కోసం క్రమశిక్షణతో నిరంతరం శ్రమించాలని సూచించారు. చదువు అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ఉపయోగపడే గొప్ప సాధనం అని తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలగా జిల్లా పరిషత్ హైస్కూల్ ఎంపిక కావడం విద్యార్థులకు ఎంతో మంచి అవకాశమని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాలలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ అదృష్టాన్ని అవకాశంగా భావించి, దానిని విజయంగా మలుచుకోవాలని అన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలు, కలలను నెరవేర్చే దిశగా అనుక్షణం కృషి చేయాలని సూచించారు. మహానుభావులు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, వారి విజయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. "కలలు కనడం మాత్రమే కాదు.. ఆ కలలను సాకారం చేసుకునేందుకు క్రమశిక్షణతో సాధన చేయాలి" అని సూచించారు. విద్యార్థులు తమ మేధస్సును, తెలివితేటలను సరైన మార్గంలో ఉపయోగించుకొని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఆత్మన్యూనతా భావాన్ని విడిచిపెట్టి ఉత్సాహంగా, చలాకీగా ఉంటూ మంచి లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచిం చారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా, సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థుల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. అయితే సోషల్ మీడియా ప్రభావంతో చెడు అలవాట్లకు లోనుకావద్దని, టెక్నాలజీని చదువు, జ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, లక్ష్య సాధనకు ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో వేసుకునే మంచి పునాదులే భవిష్యత్తులో విజయాలకు బాటలు వేస్తాయని తెలిపారు.

**-విద్యార్థులు సమాజానికి సేవ చేసే మహావృక్షాలుగా, వనరులుగా ఎదగాలి..**

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఎస్పీ ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన, మంచి ఆలోచనలతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని తెలిపారు. అవకాశాలు ప్రతి ఒక్కరి జీవితంలో వస్తాయని.. వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకొని విజయాలుగా మలుచుకోవడం విద్యార్థుల చేతుల్లోనే ఉందని ఎస్పీ నరసింహ తెలిపారు. విద్యార్థులు మహానుభావుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని, తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తూ, ఉపాధ్యాయులు నేర్పిన విద్యను అభ్యసిస్తూ, క్రమశిక్షణతో జీవిస్తూ తమకు, తమ కుటుంబానికి, పాఠశాలకు, సమాజానికి గర్వకారణంగా నిలిచేలా ఎదగాలని ఆకాంక్షించారు.

**-సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, పిన్ పాస్‌వర్డ్, బ్యాంక్ వివరాలు వెల్లడించవద్దని తెలిపారు. అత్యాశకు గురికావద్దని, ఉచితాల పేరుతో వచ్చే సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిం చారు. "తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే, దాని వెనుక సైబర్ మోసం ఉండే అవకాశం ఉందని గుర్తించాలి" అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ప్రసన్న కుమార్, సిఐ వెంకటయ్య, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ లు, యాదవే ందర్ రెడ్డి, సాయిరాం, హరికృష్ణ, భరోసా ఎస్ఐ మౌనిక, షీ టీం ఎస్ఐ నీలిమ, పాఠశాల హెడ్ మాస్టర్ గోలి పద్మ, పిజికల్ డైరెక్టర్ విస్వజ్ఞా చారి, ఇంచార్జీ హెడ్ మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి, సునీత, సుమతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం' ఆఫీసర్లు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలి

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్



తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 17న సూర్యాపేటలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10:00 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఐడీఓసీ కాంప్లెక్స్‌లోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 09:30 గంటలకల్లా వేడుకల ప్రాంగణానికి చేరుకోవాలని స్పష్టం చేశారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగం మరువలేనిది

భానుపురి/సూర్యాపేట టౌన్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం చామల అశోక్ కుమార్ ఇంటి వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు చామల లచ్చయ్య ఫొటోకి పూలమాలలు వేసి నివాళులర్పించిన బొమ్మిడి లక్ష్మీనారాయణ, ఖమ్మంపాటి అంతయ్య జండా ఆవిష్కరణ చేశారు. అనంతరం చామల అశోక్ కుమార్ మాట్లాడుతూ. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, పేదల హక్కుల కోసం, నైజాం రాచరిక వ్యవస్థ నిర్మూలన కోసం, గ్రామీణ భూస్వామ్య దొరల దౌర్జన్యాల అంతం కోసం జరిగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటంలో చామల లచ్చయ్య పోరాట పటిమ మరువలేనిదని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రం ఇండియన్ యూనియన్ లో విలీనమై సెప్టెంబర్ 17 నాటికి 78 సంవత్సరాలు పూర్తవుతున్నాయని, బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుండి ఆగస్టు 15, 1947లో స్వాతంత్ర్యం లభించిన ఏడాది తర్వాత హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు నైజాం రాచరిక నిరంకుశ పాలన నుండి విముక్తి పొందారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగా హైదరాబాద్ సంస్థానంతో పాటు దేశవ్యాప్తంగా భూసంస్కరణల అజెండా ముందుకు వచ్చిందని, నాలుగున్నర వేల మంది అమరుల త్యాగాల ఫలితంగా 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ, రక్షిత కౌలుదారు చట్టం, ఇనాం భూముల చట్టం వంటి విజయాలు సాధించామని, వాటిని నాటి నేటి పాలకులు విస్మరిస్తున్నారని విమర్శించారు. దంతాల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు బొమ్మగాని



శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, నీలా శ్రీనివాస్, సముద్రాల మనోహర్, అయినాల సుధాకర్, దంతాల పద్మ రేఖ, ఎడెల్లి శ్రీకాంత్, ఎండి పాషా,గాలి కృష్ణ సివిల్ సప్లై నాయకులు వెంకన్న శంకర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధన కోసం బంద్ ను విజయవంతం చేయాలి

-అఖిలపక్షాల ఆధ్వర్యంలో బంద్ కరపత్రం ఆవిష్కరణ

భానుపురి /సూర్యాపేట టౌన్

బుల్లెట్ ట్రైన్ సాధన కోసం చేస్తున్న ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 18న అఖిలపక్షాల ఆధ్వర్యంలో తలపెట్టిన సూర్యాపేట బంద్ ను విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో బుధవారం బిజెపి పట్టణ అధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 60 రోజులుగా పట్టణంలో బుల్లెట్ సాధన కోసం కొనసాగుతున్న ఉద్యమ కార్యక్రమాలతో పాటు 34 రోజులుగా దీక్ష కొనసాగుతుందని అయినా పాలకులు స్పందించకపోవడంతో సూర్యాపేట జిల్లా బందుకు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. ప్రజల వ్యాపార వాణిజ్య సంస్థల తో పాటు అన్ని వర్గాల సంఘాల భాగస్వామ్యంతో ఈ బందుకు పిలుపునిచ్చినట్లు వారు ప్రకటించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా బందు జరిగేలా అందరూ సహకరించాలని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థలు,



వాణిజ్య వ్యాపార సంస్థలు, ఈ బందుకు సంపూర్ణ మద్దతు నిచ్చాయని ప్రజలంతా బుల్లెట్ ట్రైన్ సాధనే లక్ష్యంగా ఈ బందుకు సహకరించాలని వారి కోరారు. గురువారం సాయంత్రం బంద్ విజయవంతం కోసం బైక్ ర్యాలీ ఉంటుందని, శుక్రవారం పట్టణంలో బంద్ ప్రశాంతంగా నిర్వహిం చేందుకు శాంతియుత ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు, గత రెండు రోజులుగా పట్టణంలోని వివిధ వ్యాపార కార్పొరేట్ సంస్థలకు బందుకు సంబంధించిన వినతి పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షాల నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, రమణాచారి, ధర్మార్జున్, చల్లమల్ల నరసింహ, బూర మల్సూర్ గౌడ్, సలిగంటి వీరేంద్ర, బూర వెంకటేశ్వర్లు, కునుకుంట్ల సైదులు, సకినాల కృష్ణ, జీడి బిక్షం, కోడి లింగయ్య, మామిడి సత్యనారాయణ, సాయి,తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో 'బేటీ బచావో--బేటీ పడావో' పోషకాహార అవగాహన సదస్సు

భానుపురి/ఆత్మకూర్ (ఎస్)



ఆత్మకూర్ (ఎస్)మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నందు మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటీ బచావో--బేటీ పడావో' పథకంలో భాగంగా బుధవారం విద్యార్థినులకు పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ, కిశోర బాలికలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. బాలికల విద్య, సంరక్షణతో పాటు ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, బేటీ బచావో--బేటీ పడావో లక్ష్యాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణ మాట్లాడుతూ, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిత్య జీవితంలో స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా విద్యార్థినులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ చురుగ్గా రాణించవచ్చని తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినులకు న్యూట్రిషనల్ కిట్ అందచేయడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి సరస్వతి, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వినోద్, పాఠశాల సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట ప్రజల ఆత్మగౌరవం

భానుపురి/ సూర్యాపేట టౌన్



సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించుకోవడశీ అనేది జిల్లా ప్రజల ఆత్మగౌరవం అని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సుధ గారి నాగేశ్వరరావు అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ నిర్వహించే 34వ రోజు రిలే నిరాహార దీక్షకు తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా కేంద్రం జాతీయ రహదారి 65 గంటల పట్టణాల అవసరాలను గుర్తించి మంజూరు చేశాక కొందరు స్వార్థం కోసం దారి మళ్ళీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్న కుట్రలను తప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన లక్ష్యంగా సూర్యాపేట జిల్లా ప్రజలు ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్‌రైలు సాధన అఖిలపక్ష నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్,రమణాచారి, ధర్మార్జున్, చల్లమల్ల నరసింహ, కర్నాటి కిషన్, వెలుగు వనిత, సకినాల కృష్ణ తదితరులు సంఘీభావం తెలిపారు.

## అన్నదానం మహాదానం

-తొమ్మిదో వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

భానుపురి /సూర్యాపేట



అన్నిదానాల్లో కంటే అన్నదానం మహాదానమని అన్నం పరబ్రహ్మ స్వరూపమని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని వార్డులో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ద్వితీయ వార్షికో త్సవాన్ని పురస్కరించుకొని బుధవారం గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్న ప్రసాద వితరణ ను ప్రారంభించి మాట్లాడారు. గణనాథుడి ఆశీస్సులతో విఘ్నాలు తొలగి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిం చారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావ రణంలో నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## చిరుమర్తి గ్రామంలో ప్రతి విగ్రహానికి 5116 రూ విరాళం అందించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

భానుపురి/నల్గొండ

మాడ్గులపల్లి మండలంలోని చిరుమర్తి గ్రామంలోని ప్రతి గణేష్ విగ్రహానికి 5,116 రూపాయల చొప్పున విరాళంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అందించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గణేశుని మండపంలో స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలకు భక్తి భావాన్ని, స్నేహ భావాన్ని పెంపొందిస్తుంది అని అన్నారు. గణేష్ ని ఆశీస్సులతో గ్రామంలో సుఖ సంతోషాలతో పైరు పంటల సమృద్ధిగా పండాలని ఆయురారోగ్యాలు గ్రామ ప్రజలంతా ఉండాలని వారు కోరారు.



## నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

భానుపురి/మిర్యాలగూడ



నాగార్జునసాగర్ ఎడమ కాలువలో వేములపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రోజు మహిళ మృతదేహం లభ్యమయింది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గోదావరి గూడెం దగ్గర గుర్తుతెలియని మహిళా మృతదేహం కాలువలో నీటిలో కోట్టుకుని రాగా స్థానికులు ఇచ్చిన సమాచా రంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చూరీ లో గుర్తింపు నిమిత్తం మృతదేహాన్ని భద్రపరిచారు. ఆమె వయసు సుమారు 35 నుండి 40 సంవత్సరాల మధ్యలో ఉండవచ్చునని అంచనా బూడిద రంగు టాపు బ్రౌన్ రంగు ప్యాంట్ దుస్తులు వేసుకుంది సుమారు 5 అడుగుల ఎత్తు ఉంది ఈ మహిళ ఆచూకీ తెలిపిన ఎవరైనా తప్పిపోయినట్టు తెలిపిన దయచేసి వెంటనే వేములపల్లి పోలీస్ స్టేషన్ను సంప్రదించగలరు ఎస్సై వేములపల్లి సెల్ నెంబర్ 8712670190 పోలీస్ స్టేషన్ నెంబర్ 8712670808. లను సంప్రదించగలరు.